Featured on September 11, 2011

మంచి చదువుల మార్గమిది
ఈనాడు చదువు
ప్రతి సోమవారం

# ఈనాడు

11-9-2011 ఆదివారం సిటీ సంపుటి 38 . సంచిక 33

THE LARGEST CIRCULATED DAILY IN ANDHRA PRADESH

రూ. 3-50 పైసలు పేజీలు 14+32+

from Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajahmundry, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chenn

ఈ గమ్యం

# ప్రపంచ బ్యాంకు 'దున్నే'స్తుంది

సాగు ఇక వారి కనుసన్నల్లో..

శాసిస్తారు.. నియంత్రిస్తారు!

అగ్రికల్చరల్ గవర్నెన్స్ సెల్‌లో

క్రియాశీల పాత్ర

కార్పొరేట్ సాగుకు తలుపులు బార్లా!

ప్రత్యేకంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి

ప్రపంచబ్యాంకు పెద్దన్న ఇక మన వ్యవసాయ రంగంలోకి చొచ్చుకురాబోతున్నాడు. ఇన్నాళ్లూ జలవనరులు, మౌలిక సదుపాయాల్లాంటి వాటిలో జోక్యానికే పరిమితమైన బ్యాంకు ఇక మన వ్యవసాయ విధానాన్నీ శాసించనుంది. సలహాలతో మొదలయ్యే ఈ జోక్యం ఆఖరికి రాష్ట్ర వ్యవసాయ రంగం మొత్తాన్ని నియంత్రించినా ఆశ్చర్యపోనక్కర్లేదు! అదే జరిగితే.. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య వ్యవసాయంతో పాటు, కార్పొరేట్ సాగూ తెరపైకి వస్తుంది. అప్పుడు సంస్కరణల తీగపై అన్నదాత సర్కస్ ఫీట్లు తప్పకపోవచ్చు. రైతు విత్తనం వేయడం మొదలుకుని, ఉత్పత్తిని మార్కెట్లో విక్రయించేదాకా.. సమస్తం ప్రపంచబ్యాంకు చెప్పినట్లు చేయాల్సి వస్తుంది. ఫలితంగా రైతు జీవన చిత్రం తారుమారు కావొచ్చు! సంప్రదాయ వ్యవసాయం 'భోరు'మననూ వచ్చు!

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ప్రపంచబ్యాంకు ప్రత్యక్ష జోక్యానికి రంగం సిద్ధమయింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి రైతుల్ని బయటపడేసేందుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సుపరిపాలనా కేంద్రం) ఆధ్వర్యంలో 'అగ్రికల్చరల్ గవర్నెన్స్ సెల్' పేరుతో ప్రత్యేకంగా ఓ ప్రాజెక్టు ఏర్పాటుకానుంది. అన్నదాత ఆదాయం, ఉత్పాదకతను పెంచడం, రైతుల్లో వాణిజ్య దృక్పథాన్ని పెంపొందించడం దీని లక్ష్యం. ఇందులో ప్రపంచ బ్యాంకు క్రియాశీల పాత్ర పోషించనుంది. ప్రాజెక్టు నిర్వహణకు ప్రపంచబ్యాంకు నిధులు విడుదల చేస్తుంది. తద్వారా అది కార్యక్రమం పకడ్బందీగా జరగడానికి సమీక్షలు చేస్తుంది. నిధుల విడుదలకు షరతులు విధిస్తుంది. అంటే ప్రపంచబ్యాంకు సూచించినట్లుగా ఈ కార్యక్రమం అమలవుతుందన్నమాట! కార్యక్రమ రూపకల్పన, అమలు.. ఇలా 17 అంశాలపై గవర్నెన్స్ సెల్ దృష్టి సారిస్తుంది. వాటిలో ముఖ్యమైనవి

(మిగతా 2లో)



# ప్రపంచ బ్యాంకు 'దున్నేస్తుంది'!

(మొదటి పేజీ తరువాయి)

ఇలా ఉన్నాయి... వ్యవసాయ రంగంలో ప్రకృతి వైపరీత్యాల ప్రభావం, జాతీయ వ్యవసాయ రుణ విధానం, సన్న-చిన్న కారు రైతులను బ్యాంకు రుణాలు లభించేలా చేయడం, సహకార రంగంలో సంస్కరణలు, వ్యవసాయాన్ని వాణిజ్యంగా మార్చడం, పశు సంవర్ధక, పండ్ల తోటల పెంపకం, నీటి సరఫరా వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం, విత్తన ఉత్పత్తి, విత్తనపరిశ్రమలో నియంత్రణ యంత్రాంగం... ఇలా అనేక అంశాలపై ఇది దృష్టిసారిస్తుంది.

సాగుకు సంబంధించిన దాదాపు అన్ని అంశాలపైనా సెల్ దృష్టిపెడుతుంది కాబట్టి... ఇందులో ప్రముఖ పాత్ర పోషించే ప్రపంచ బ్యాంకు కూడా వీటన్నిటిపైనా పర్యవేక్షణ కలిగి ఉంటుంది. నాబార్డు, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇక్రిశాట్, క్రీడా, స్వచ్ఛంద సంస్థలతో కలిసి గవర్నెర్స్ సెల్ పనిచేస్తుంది.

**రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఛైర్మన్‌గా..:** పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారిని అగ్రికల్చరల్ గ్రీవెన్స్ సెల్‌కు ఛైర్మన్‌గా నియమిస్తారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో విధానాల రూపకల్పన, అమలులో రాష్ట్ర, జాతీయస్థాయిలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. ఈ సెల్ చేపట్టే ప్రాజెక్టులకు అవసరమైన నిపుణుల ఎంపిక, ఇతర ఏర్పాట్లు సుపరిపాలనా కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతాయి. ఈ కేంద్రం సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతిలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ కంపెనీలతో కలిసి పని చేస్తుంది. ఇది చేపట్టే కార్యక్రమాలకు ఫీజులు వసూలు చేస్తుంది. ప్రత్యేకంగా గ్రాంటులు తీసుకొంటుంది. ప్రపంచబ్యాంకు గ్రాంటు రూపంలో నిధులిచ్చి మొత్తం కార్యక్రమాన్ని వెనుక ఉండి నడిపిస్తుంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపట్టడానికి కూడా ఈ సెల్ ఒప్పందాలు చేసుకోనుంది.

**ప్రయోగాత్మకంగా అమలు:** అగ్రికల్చరల్ గ్రీవెన్స్ సెల్ మొదట ప్రయోగాత్మకంగా కార్యక్రమాలు చేపట్టనుంది. ఆంధ్రప్రదేశ్‌లో తుపానులు, వరదలు, కరవు ప్రభావాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వీటిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయరంగంలో అనేక మార్పులు చేయడానికి శ్రీకారం చుట్టనుంది. కరవు ప్రాంతాల్లో నీటినిల్వ కట్టడాలు, తుపాన్లు వచ్చే ప్రాంతాల్లో మొక్కలు నాటడం, సముద్రానికి గోడ కట్టడం(సీ వాల్ కన్‌స్ట్రక్షన్) మొదలైన వాటితో పాటు బీమా, భూ వినియోగ ప్రణాళికలను మెరుగుపర్చడం లాంటి కార్యక్రమాలను కూడా చేపట్టనుంది. ఇందులో ప్రజల్ని భాగస్వాములుగా చేయనుంది. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోపాటు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ సంస్థలు పాలు పంచుకొనేలా చేయనున్నారు. రాష్ట్రం మొత్తమ్మీద ఎనిమిది నుంచి పది ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అధ్యయనం చేయనున్నారు. మొదట ఆరునెలలు ప్రయోగాత్మకంగా అమలుచేశాక మూడేళ్ల పాటు రాష్ట్రం మొత్తానికి విస్తరించనున్నారు. పంట ప్రణాళికలపై వివిధ విభాగాలతో ఒప్పందాలు చేసుకొని అమలుచేయడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంటలకు, పశు సంపదకు జరిగిన నష్టాన్ని అంచనావేయడం, తుపానులు, వరదలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు హార్వెస్టింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలు, ఈ సమయంలో నిల్వ చేయడానికి తీసుకోవడానికి చర్యలపై దృష్టి పెడుతుంది. పంట ఉత్పాదకతను పెంచడంపై దృష్టి కేంద్రీకరించనుంది. ఓ వైపు కార్పొరేట్ వ్యవసాయం, వ్యవసాయ రంగంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతుండగా.. రాష్ట్రంలో ఇందుకోసం ప్రత్యేకంగా ఓ కేంద్రాన్నే ఏర్పాటుచేయడం చర్చనీయాంశం కానుంది.

– న్యూస్‌టుడే, హైదరాబాద్

Featured on September 11, 2011 in 'EENADU'